క్లుప్తంగా

ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎంపీడీవో సలీమ్

ఇబ్రహీంపట్నం: ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సలీమ్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆరుబయట పిచ్చిమొక్కలను తొలగించి పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్యాధికారి హరీశ్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టు శ్రీనివాస్

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై సైకాలజిస్టు అడ్డిగ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ వ్యక్తిత్వ నిర్మాణం కోసం అలవర్చుకోవాల్సిన అంశాలను వివరించారు. రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద కాలువకు నీరు విడుదల చేయాలి

మల్యాల: ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వరద కాలువ భూమి ఆక్రమణపై దృష్టి సారించాలని కోరారు. మల్లేశం, వెంకటస్వామి, ప్రసాద్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

గొల్లపల్లి: ఇబ్రహీంనగర్ శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన తునికి శ్రీనివాస్ చిన్న వయసులోనే ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందాడు. మృతుడికి భార్య, చిన్న పిల్లలుండగా.. ఈ నిరుపేద కుటుంబానికి గురువారం రెడ్డి జన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది కిష్టంపేట రామచందర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. చిలుకమారి శ్రీనివాస్ రూ.2వేలు అందించారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

కథలాపూర్: దుంపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానికులైన దండిక ప్రవీణ్–పావని దంపతులు సౌండ్ సిస్టమ్ గురువారం అందించారు. చదువు నేర్చుకున్న పాఠశాలకు ఏదైనా సహకారమందించాలనే ఉద్దేశంతో సౌండ్ సిస్టమ్ అందించినట్లు దాతలు పేర్కొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

జగిత్యాల/మల్యాల: కొండగట్టు పరిసరాల్లో అటవీ శాఖతోపాటు నేచర్ లవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు సుమారు 500 వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. కోతులకు ఆహారమందించాలనే సంకల్పంతో ఫారెస్టు డిపార్ట్‌మెంట్, నేచర్ లవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్ల నేరేడు, రేగు, సీతాఫల్, మేడి, చింత వంటి పండ్ల మొక్కలు నాటామని ఎఫ్ఆర్వో మోయినొద్దీన్ తెలిపారు. కొండగట్టు ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, నేచర్ లవర్ ఫౌండేషన్ అధ్యక్షుడు శేఖర్, బొడ్డుల శ్రవణ్‌కుమార్, రాంకిషన్, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ రామకృష్ణ, నరేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

వాన కోసం కప్పతల్లి ఆట

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో గురువారం గ్రామస్తులు వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట ఆడారు. రోకలి బండకు కప్పను కట్టి భుజాలపై మోస్తూ డప్పులతో ఊరేగించారు. కప్పను మోస్తూ ఇంటింటికి వెళ్లగానే బిందెలతో నీరు పోసి వర్షాలు కురవాలని మొక్కుకున్నారు. సమీపంలోని చెరువులో కప్పను వదిలారు. కాగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది.

కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: ధర్మపురి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంక వరప్రసాద్ ఎన్నికయ్యారు. ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో గురువారం సీనియర్ పాత్రికేయుడు సోమిశెట్టి మురళి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చిలుములు రాజేందర్, ఉపాధ్యక్షులుగా రెంటం శంకర్, వడ్లూరి రవీందర్ ఎన్నికయ్యారు.

ధర్మపురిలో జోరు వాన

- ఇళ్లలోకి వర్షం నీరు
- ఇబ్బందుల్లో కాశెట్టివాడ వాసులు



ధర్మపురిలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న కాలనీవాసి



ఇంట్లోకి చేరిన వర్షం నీరు

ధర్మపురి: ధర్మపురిలో గురువారం కురిసిన భారీ వర్షంతో డ్రైనేజీ పొంగి పొర్లి ఇళ్లలోకి చేరడంతో కాశెట్టివాడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధర్మపురిలోని చింతామణి చెరువు కట్ట వద్ద కొన్ని రోజుల నుంచి రోడ్డు పనులు చేపడుతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పనులు చేపడుతున్న నేపథ్యంతో డ్రైనేజీలోకి రాళ్లు, కంకర పడి డ్రైనేజీ మూసుకుపోయింది. కాశెట్టివాడలో పాత కాలం నాటి ఒకే ఒక చిన్నపాటి డ్రైనేజీ ఉండడంతో డ్రైనేజీ శిథిలమై అస్తవ్యస్తంగా తయారైంది. కాశెట్టివాడకు చెందిన మాదాసు రాజన్న, చీపిరిశెట్టి రమేశ్, గడిపెల్లి చంద్రయ్య, మాదాసు సత్తక్క, బండారి మల్లయ్యకు చెందిన ఇళ్లలోకి నీళ్లు చేరి నిత్యావసర వస్తువులన్నీ నీటిపాలయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం నీటితోపాటు డ్రైనేజీ నీరు చేరడంతో దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీటిని బకెట్లతో ఎత్తిపోసి అవస్థలపాలయ్యారు. అధికారులు తక్షణం స్పందించి డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



జగిత్యాలక్రైం: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో..



అంతర్గాం జిల్లాపరిషత్ పాఠశాలలో..



కోరుట్లలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో..

రాఖీ వేడుకలు

జగిత్యాలక్రైం: అన్నదమ్ములు, అక్కచెల్లెలకు ఆత్మీయ బంధం రాఖీ అని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో అభ్యాస పాఠశాల విద్యార్థినులు పోలీసులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: అంతర్గాం జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. అల్లీపూర్‌కు చెందిన వేద పండితుడు అంగడి భూమేశ్వర్ ఆశీర్వచనం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, ఉపాధ్యాయులు భూపతిరావు, సరోజన, అనిత, రజినికర్ రెడ్డి, రాజేందర్, పీడీ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్లటౌన్: కల్లూర్ రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: పాతదాంరాజుపల్లి పాఠశాలల్లో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు భవాని, అరుణ్, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: కోమటికొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యార్థినులు రాఖీ కట్టారు. ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుధారాణి, విశాల్, నర్మద, జోత్స్న, రాణి పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సంగెనభట్ల నర్సిహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం మండలం వెంకటరావుపేటలోని పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వినూత్న రీతిలో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. మర్రి ఆకులను రాఖీలుగా మలిచి మొక్కలు నాటి వాటికి కట్టారు. ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజగోపాల్‌రెడ్డి, రత్నాకర్, గంగాధర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: గుల్లకోట, పైడిపెల్లి ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించారు. హెచ్ఎంలు రాజిరెడ్డి, తులసి ఆగమయ్య పాల్గొన్నారు.



వెంకటరావుపేటలో మర్రి ఆకులతో రాఖీలు కట్టుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



బీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో..



గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో..



కోమటికొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో..



భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో..



రాయికల్: జిల్లాపరిషత్ పాఠశాలలో..



పాతదాంరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..

తల్లి పాలతోనే ఎదుగుదల



ఇటిక్యాలలో సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయికల్: తల్లి పాలతోనే పిల్లల ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. గురువారం ఇటిక్యాల, రాయికల్ పట్టణంలోని ఒడ్డెర కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించగా.. బాలింతలకు తల్లి పాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, నవ్య, మౌనిక, ఇటిక్యాలలో కుంట సుజాత, మామిడి బుజ్జమ్మ పాల్గొన్నారు.

మల్లాపూర్: పుట్టిన పిల్లలు 6 నెలల వరకు తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఎంఎల్‌హెచ్‌పీ దేవిప్రసన్న, పంచాయతీ కార్యదర్శి అశోక్ అన్నారు. చిట్టాపూర్, సంగెం–శ్రీరాంపూర్ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలతో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు స్నేహలత, రజిత, మేరి, ఏఎన్ఎం సుశీల, ఆశ కార్యకర్త భూదేవి తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల, తక్కళ్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పదార్థాలు ప్రదర్శించారు. ముందస్తు రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు సంతోషిణి, రజిత, మమత, తల్లులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. చిన్నారులకు డీసీసీ మాజీ కార్యదర్శి పెంట లింబాద్రి, కాంగ్రెస్ మండల సేవాదళ్ సమితి అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుర్రి ముత్యం అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు మాధవి, పుప్పాల రమ్య, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పెగడపల్లి: తల్లి పాలు బిడ్డ ఎదుగుదలకు దోహదపడతాయని సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

జాతీయ చేనేత దినోత్సవం



రాయికల్‌లో చేనేత కార్మికులను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

రాయికల్: పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం పద్మశాలీ సేవాసంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం చేనేత కార్మికులను సన్మానించారు. పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడు బోగ రాజేశం, ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి ఆడెపు నర్సయ్య, యువజన సంఘం అధ్యక్షుడు సామల సతీశ్, ఉపాధ్యక్షుడు సింగం సతీశ్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజు, కోశాధికారి బొమ్మకంటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండల, పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘ భవనంలో నిర్వహించారు. మార్కండేయస్వామి చిత్రపటానికి పూలమాల వేసి మగ్గం నేశారు. అంకం భూమయ్య, అలిశెట్టి రవీందర్, కొక్కుల భూమయ్య, ఓద్నాల ఆంజనేయులు, చౌటపల్లి తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: ముత్యంపేటలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. పద్మశాలీ సంఘ భవనంలో మార్కండేయ యూత్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు జనార్దన్, భూమయ్య, మల్లేశం, ఎల్లయ్య, మల్లయ్యను సన్మానించారు. ముల్క మల్లయ్య, సామల దేవరాజం, కట్కూరి రాజేశం, బాలె కుమార్, చక్రధర్, వంశీకృష్ణ, శ్రీనివాస్, మహేందర్, సతీశ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తులు అందజేత

బుగ్గారం: మద్దునూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో గురువారం స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ జె.రాజు సహకారంతో స్థానిక ప్రధానోపాధ్యాయుడు మధుకర్‌రావు ఆధ్వర్యంలో సుమారు రూ.45వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు.

ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలి



ట్యాబ్ పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతీ దరఖాస్తుదారుడికి సత్వరమే పోలీసు సేవలందించాలని సూచించారు. రూరల్ ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో ఆర్థిక ప్రయోజనం

మెట్‌పల్లి: సీఎం సహాయ నిధితో పేదలకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన 58 మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ.13.34లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలి

కోరుట్ల: మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ నివారణకు భారీ జరిమానాలు వేస్తున్నారని, తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ గురువారం కోరుట్ల వ్యాపార సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమన్వయంతో ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని సూచించారు. వ్యాపారులపై భారీగా జరిమానా వేయొద్దని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు సూచించారు. వ్యాపార సంఘం అధ్యక్షులు చిద్రాల అశోక్, గాదె సాయి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వాగతోత్సవం

కోరుట్ల: పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో గురువారం స్వాగతోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కరస్పాండెంట్, అధ్యాపకులు, పలు హైస్కూళ్ల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



పెగడపల్లి: నందగిరి తెనుగువాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. 30 మంది విద్యార్థులుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. పాఠశాల ప్రారంభించి ఏళ్లు కావస్తున్నా.. ఇప్పటివరకు గోడ నిర్మాణం చేయక పశువులు, కుక్కలు సంచరిస్తూ పాఠశాల ఆవరణలో పరిశుభ్రత లోపిస్తోందన్నారు. రూ.లక్షలు వెచ్చించి పాఠశాల భవనాలు నిర్మించిన అధికారులు.. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అధిక మొత్తంలో యూరియా విక్రయిస్తే చర్యలు



డబ్బా డీసీఎంఎస్ ఎరువుల దుకాణంలో విత్తన సంచులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

ఇబ్రహీంపట్నం: రైతులకు అధిక మొత్తంలో యూరియాను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, ఒక రైతుకు 2 బస్తాలనే విక్రయించాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. గురువారం డబ్బా గ్రామంలో డీసీఎంఎస్ ఎరువుల దుకాణం, ఇబ్రహీంపట్నం సొసైటీలో తనిఖీలు చేపట్టారు. ఎరువుల దుకాణాల్లో ఈపాస్ యంత్రాలు, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఏఈవో వినోద్, ఆర్ఐ రేవంత్‌రెడ్డి, సొసైటీ సీఈవో మంత్రి సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలక్రైం: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి సంబంధించి ప్రచురితమైన వార్తకు ఎలాంటి సంబంధం లేని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఫొటో, వార్తను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు గురువారం పట్టణ సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పరువుకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మాజీ కౌన్సిలర్లు దుర్గయ్య, గాజుల రాజేందర్, గుండ మధు, రఘువీర్‌గౌడ్, మొగిలి, రియాజ్, నేహాల్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



పెగడపల్లి మండల పరిషత్‌లో సమావేశమైన అధికారులు

పెగడపల్లి: ఈనెల 11న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి నరేశ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈనెల 11న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంఈవో సులోచన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర, హెల్త్ సూపర్‌వైజర్ జయశీల పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 11న నిర్వహించే నులిపురుగుల నివారణ దినోత్సవంలో విద్య, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, విద్యాశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు సింధూజ, రచన, ఎంఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ధర్మపురి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 1 నుంచి 19 ఏళ్ల వయస్సున్న ప్రతీ ఒక్కరికి, పాఠశాలల్లో చేరిన 5–19 ఏళ్ల వారికి, బడి బయట, కౌమార దశలో ఉన్నవారికి నులిపురుగుల మాత్రలను తప్పక వేయించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు, ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, అంగన్‌వాడీలు తదితరులున్నారు.

క్రైం కార్నర్..

మోసం చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: రేచపల్లి గ్రామంలో భూమి కొనుగోలు చేసిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై గీత కథనం ప్రకారం.. లచ్చునాయక్ తండా గ్రామానికి లావుడ్య జలపతి రేచపల్లి గ్రామానికి చెందిన దువాక రాములుకు 2005లో రూ.80వేలు చెల్లించి 35 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. డబ్బులు తీసుకున్న రాములు భూమిని జలపతి పేరున రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఇదే క్రమంలో రాములు జలపతికి అమ్మిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి జలపతి సాగు చేసిన పొలంలో గడ్డి మందు చల్లి పొలానికి నష్టం కలిగించి కులం పేరుతో దూషించాడు. జలపతి ఫిర్యాదు మేరకు రాములుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ప్రియురాలు

ఇబ్రహీంపట్నం: పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేసి మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి, అదే గ్రామానికి చెందిన బండారి రాజ్‌కుమార్ కొన్ని నెలల నుంచి ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో ప్రియుడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేసింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

పాప బంగారం అమ్మి ఇచ్చిన..

కోరుట్ల: మా పాప మెడలో ఉన్న బంగారం అమ్మి మరీ లంచంగా ఇచ్చినా.. ఇంకా డబ్బులు కావాలని వేధించాడని డీటీవోను ఏసీబీకి పట్టించిన బాధితుడు శశిధర్ గురువారం తన ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.లక్ష మేర లంచంగా ఇచ్చినా.. సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకొని మళ్లీ డబ్బులు డిమాండ్ చేశారని అన్నాడు. ఈ పరిస్థితుల్లో ఏసీబీ అధికారులను ఆశ్రయించానన్నాడు. ఏసీబీకి పట్టుబడ్డ డీటీవో బద్రునాయక్ వద్ద సుమారు 30 సెల్‌ఫోన్లు దొరికినట్లు సమాచారం. ట్రాక్టర్లు, టిప్పర్లు, ఇతరత్రా వాహనాలను పట్టుకున్న సందర్భాల్లో వాటి యజమానుల సెల్‌ఫోన్లను తీసుకొని డబ్బులు డిమాండ్ చేయడం ఆయనకు ఆనవాయితీగా మారినట్లు తెలిసింది. ఈ క్రమంలో డీటీవో కారులో సుమారు 30 సెల్‌ఫోన్లున్న సంచి ఏసీబీ అధికారులకు దొరకడం గమనార్హం.

ముగిసిన అంత్యక్రియలు

కోరుట్ల: సౌదీ నుంచి విమానంలో వస్తుండగా గుండెపోటుకు గురై మృతిచెందిన శ్రీరాముల శ్రీధర్ అంత్యక్రియలు గురువారం ముగిశాయి. శ్రీధర్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. ఇల్లు లేకపోవడంతో అంత్యక్రియల అనంతర కార్యక్రమాలు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలోనే నిర్వహించారు.